నమస్తే తెలంగాణ

పెద్దపల్లి

8 | కరీంనగర్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | PEDDAPALLI




మంత్రి కొండా సురేఖకు వ్యతిరేకంగా నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, నాయకులు

# మంత్రి సురేఖ వ్యాఖ్యలు సరికాదు

**బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**

పెద్దపల్లి, అక్టోబర్ 3 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు సరికావని, తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పేర్కొన్నారు. మంత్రి సురేఖకు వ్యతిరేకంగా గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి, సినీతారల వ్యక్తిగత జీవితంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఆరోపణలను వెంటనే వెనక్కితీసుకొని, బేషరుతుగా కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయలేక.. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్, సినీతారలపై ఆరోపణలు చేశారని విమర్శించారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు మానుకొని, ప్రజా సంక్షేమంపై దృష్టిసారించాలని హితవుపలికారు. ఇక్కడ కౌన్సిలర్ లైశెట్టి భిక్షపతి, నాయకులు భూమేశ్, బీరం రవి, గాజాల రమేశ్, అజీం, పల్లె రాకేశ్, మహేశ్, సతీశ్ పాల్గొన్నారు.



శైలపుత్రి అలంకారంలో అమ్మవారు

# శైలపుత్రిగా అమ్మవారు

వేములవాడ టౌన్, అక్టోబర్ 3 : రాజన్న ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఉదయం వైభవంగా ప్రారంభం కాగా, మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6:30 గంటలకు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో నాగిరెడ్డి మండపంలో కొలువుదీరిన అమ్మవారి మండపం వద్ద పలు పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి అద్దాల మండపంలో ఈవో వినోద్‌రెడ్డి అర్చకులకు వర్ణి ఇచ్చి కార్యక్రమాలను ప్రారంభించారు. రాత్రి శైలపుత్రీ అలంకారంతో ఉన్న అమ్మవారిని పెద్దసేవపై హంస వాహనంలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించగా భక్తులు దర్శించుకుని తరించారు.



మాట్లాడుతున్న పుట్ట శైలజ

# బహిరంగ క్షమాపణ చెప్పాలి

**మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ**

మంథని, అక్టోబర్ 3: ప్రముఖ నటి సమంతపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు యావత్ మహిళా లోకాన్నే కించపరిచేలా ఉన్నాయని మంథని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఘాటుగా విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కొండా సురేఖ బాధ్యతగా వ్యవహరిస్తూ.. మహిళలకు అండగా నిలువాల్సిందిపోయి ఇలా అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. మంత్రి వెంటనే మహిళలు, నటి సమంతకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంథనిలోని రాజగృహలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మహిళలపై ఇలా మాట్లాడేందుకే సురేఖకు మంత్రి పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. ఆమె వ్యాఖ్యలను ఇతర మంత్రులు, ఆ పార్టీ నాయకులు ఖండించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కనపెట్టి.. హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నదన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే నటి సమంతపై మంత్రి సురేఖ ఇలా అసభ్యకరంగా మాట్లాడిందన్నారు. మంత్రి వ్యాఖ్యలను మంత్రులు, ఆ పార్టీ నాయకులు ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పుట్ట పద్మ, ఐయిలి రాజేశ్వరి, ఆరెపల్లి తిరుమల, భాగ్యలక్ష్మి, రేణుక, రాణి, పావని పాల్గొన్నారు.

# మన దవాఖానలు సూపర్

## వైద్య సేవలకు 'కాయకల్ప గుర్తింపు'

- జిల్లాలోని ఆరు ప్రాథమిక, మూడు అర్బన్ వైద్యశాలలకు అవార్డులు
- బెస్ట్ పీహెచ్‌సీగా ఓదెల, యూపీహెచ్‌సీగా జనగామ
- మరో ఎనిమిది ఉప కేంద్రాలకూ పురస్కారాలు, ప్రోత్సాహక బహుమతులు



బెస్ట్ యూపీహెచ్‌సీ జనగామ(ఫైల్)

ఉత్తమ వైద్య సేవలు, నిర్వహణలో మన పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మెరిశాయి. ఉత్తమ వైద్యం, రోగులకు మెరుగైన సేవలందించడంలో సత్తాచూపి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కాయకల్ప పురస్కారాలు దక్కించుకున్నాయి. ఆరు పీహెచ్‌సీలు, మూడు యూపీహెచ్‌సీలతోపాటు ఎనిమిది ఉప కేంద్రాలకు అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు రాగా, వైద్యులు, సిబ్బందితో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



బెస్ట్ సబ్ సెంటర్ కనుకుల(ఫైల్)

పెద్దపల్లి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సర్కారు దవాఖానలు బలోపేతమయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో వందలాది కోట్ల నిధులు వెచ్చించడంతో కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయి. రోగులకు సకల సౌకర్యాలతో మెరుగైన సేవలందిస్తున్నాయి. అందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నాయి. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ముందుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా అందించే ప్రతిష్టాత్మక కాయకల్ప అవార్డులకు ఎంపికయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను దవాఖానల్లో ఔట్, ఇన్‌పేషెంట్, లేబోరేటరీ సర్వీసెస్, ఫార్మసీ, ప్రసవాలు, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుతోపాటు రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తదితర వాటన్నింటిపై ఎన్‌క్వాస్ అధికారుల బృందం పూర్తి స్థాయి అధ్యయనం చేసింది. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 18 పీహెచ్‌సీలు ఉన్నాయి. అందులో ఓదెల పీహెచ్‌సీని 80శాతం పాయింట్లతో బెస్ట్ పీహెచ్‌సీగా ఎంపికగా, ₹2లక్షల నగదు ప్రోత్సాహం అందనున్నది. 79పాయింట్లతో బేగంపేట, 76 పాయింట్లతో కొలనూరు, 75పాయింట్లతో ముత్తారం, 74పాయింట్లతో గద్దలపల్లి, 73శాతం పాయింట్లతో పుట్నూరు పీహెచ్‌సీలకు ₹50వేల చొప్పున నగదు బహుమతి లభించనున్నది. ఇక జిల్లాలో ఉన్న ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీలు) అవార్డుల కోసం మూడింటిని ఎంపిక చేశారు. జనగామ యూపీహెచ్‌సీని 80 పాయింట్లతో బెస్ట్ సెంటర్‌గా ఎంపికగా, ₹2లక్షల నగదు ప్రోత్సాహం అందనున్నది. 75పాయింట్లతో రామగుండం, 65పాయింట్లతో అల్లూరు యూపీహెచ్‌సీలు ఎంపికగా, వీటికి ₹50వేల చొప్పున నగదు ప్రోత్సాహం రానున్నది.

### బెస్ట్ సబ్ సెంటర్‌గా కనుకుల

జిల్లాలో మొత్తం 104సబ్ సెంటర్లు ఉండగా, అందులో ఎనిమిదింటిని అవార్డు కోసం ఎంపిక చేశారు. 80పాయింట్లతో కనుకుల కేంద్రం బెస్ట్ సెంటర్‌గా ఎంపికకాగా, దీనికి ₹లక్ష నగదు ప్రోత్సాహకం లభించనున్నది. ఇక 75పాయింట్లతో రన్నర్‌గా ఆరెంద సబ్ సెంటర్ ఎంపికైంది. ఈ సెంటర్‌కు ₹50వేల నగదు ప్రోత్సాహం అందనున్నది. రెండో రన్నర్‌గా నిలిచిన ఖిలావనపర్తి సబ్ సెంటర్‌కు ₹35వేల నగదు ప్రోత్సాహం రానున్నది. వీటితోపాటు ఉత్తమ సబ్ సెంటర్లుగా ఖమ్మంపల్లి, గుంజపడుగు, ఐతరాజ్‌పల్లి, ముస్త్యాల, మూలసాల ఎంపిక కాగా, వీటికి ₹25వేల చొప్పున నగదు బహుమతి అందనున్నది.

### తొమ్మిది మంది ఏఎన్ఎంలకు నగదు ప్రోత్సాహం

జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఉత్తమంగా పనిచేసిన తొమ్మిది మందికి కాయకల్ప అవార్డులను అందజేయనున్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించడం, ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చూడడం, తదితర సేవలకు గాను పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఆరుగురు ఏఎన్ఎంలకు ఒక్కొక్కరికి ₹75వేల చొప్పున, యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ముగ్గురు ఏఎన్ఎంలకు ₹లక్ష చొప్పున నగదు బహుమానాన్ని అందజేయనున్నారు.



బెస్ట్ పీహెచ్‌సీ ఓదెల(ఫైల్)

### ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తాం



జిల్లాలోనే మా దవాఖాన నెంబర్‌వన్‌గా నిలువడం సంతోషంగా ఉంది. సిబ్బంది, వైద్యుల సమష్టి కృషితోనే ఈ గౌరవం దక్కింది. దవాఖానకు వచ్చిన ప్రతి పేషంట్‌కు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నం. దవాఖాన పరిశుభ్రతతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలు, సూచనలు తూచ తప్పకుండా అమలు చేస్తూ ప్రజాదరణ పొందాం. అందుకే నెలకు 2500 నుంచి 2800 ఓపీ చూస్తున్నాం. ముమ్ముందు ఇదే స్ఫూర్తితో మరింత ముందుకెళ్తాం.

**- షహెబాజ్‌ఖాన్, వైద్యుడు, ఓదెల పీహెచ్‌సీ**

# కాపర్ వైర్ దొంగల అరెస్ట్

**₹2లక్షల 40 వేల సొత్తు స్వాధీనం**



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీ కృష్ణ

సుల్తానాబాద్, అక్టోబర్ 3 : కూలీ పనులతో వచ్చే డబ్బులు సరిపోక పోవడంతో ఆ ఐదుగురు నేరవృత్తిని ఎంచుకున్నారు. ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారు. కాపర్‌వైర్‌ను దొంగలించి పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన గుర్రాల చిన్న భూమయ్య మరో నలుగురితో కలిసి కాపర్ వైర్ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో గత నెల 24న సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్‌లో తాళం వేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షాప్ వెనుక కిటికీ నుంచి లోపలికి దూకి ₹2లక్షల 40 వేల విలువైన కాపర్ వైర్‌ను దొంగలించారు. దీనిపై షాప్ యాజమాని గాయం నరేందర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో సుల్తానాబాద్ ఎస్ శ్రావణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారు. కేవలం వారం రోజుల్లోనే తన టీంతో దొంగలను చాకచక్యంగా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో పిట్టల సురేందర్ (మందమర్రి), సిలివేరు శంకరయ్య (మందమర్రి), గోషిక కార్తీక్ (టేకుల బస్తీ బెల్లంపల్లి), కడమండ శ్రీకాంత్ (చెత్లపూర్ మందమర్రి), పసుపులేటి శ్రీనివాస్ (అంబేద్కర్ నగర్ బెల్లంపల్లి) ఉండగా, ప్రధాన నిందితుడైన గుర్రాల చిన భూమయ్య పరారీలో ఉన్నట్టు ఏసీపీ తెలిపారు. కాపర్ వైర్‌ను హైదరాబాద్‌కు చెందిన రాముకు విక్రయించినట్టు చెప్పారు. పిట్టల సురేందర్‌పై గతంలోనే 9 కేసులుండగా, సిలివేరు శంకరయ్యపై ఏడు కేసులున్నట్టు తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

### దుర్గాదేవికి కొప్పుల దంపతుల పూజలు

కోల్‌సిటీ, అక్టోబర్ 3 : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోదావరిఖని జవహర్‌నగర్‌లోని శ్రీ జయదుర్గాదేవి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు అమ్మవారికి పలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ భవానీ కంకణం ధరించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల దంపతులు



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్

# బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్**

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 3 : మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఆడ జన్మకే కలంకమని, మతి భ్రమించి మాట్లాడుతున్నారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్ మండిపడ్డారు. ఎంగిలి పూల బతుకమ్మ రోజు మంత్రి సురేఖ ఎంగిలి మాటలు మాట్లాడారని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మహిళా మంత్రులను అడ్డం పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొండా వ్యాఖ్యలపై మాట్లాడాలంటేనే అసహ్యం వేస్తున్నదని, రాజకీయాల్లో ఇలాంటి మహిళలు ఉన్నారంటే బాధగా ఉందన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా సంస్కారహీనంగా బజారు భాష మాట్లాడారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి పేదల ఇండ్లను కూలుస్తున్నారని, దీంతో ప్రజలంతా బీఆర్ఎస్ వద్దకు వచ్చి తమ గోడును వెల్లబోసుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేకనే కేటీఆర్‌పై సురేఖ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని విమర్శించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఒక కాంగ్రెస్ మహిళ కమిషన్‌గానే కాకుండా మహిళల పక్షాన ఉండి, మంత్రి సురేఖ మాటలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జగిత్యాల, రాయికల్ ఏఎంసీ మాజీ చైర్మన్లు శీలం ప్రియాంక ప్రవీణ్, ఉదయ్‌శ్రీ, రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, తదితరులు పాల్గొన్నారు.

# దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్

ఫర్టిలైజర్‌సిటీ అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం, ప్రస్తుత ఉన్నత విద్య పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్న క్రమంలో దసరా తర్వాత కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం అధ్యక్షుడు వేంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేశ్ గురువారం తెలిపారు. ఫీజు బకాయిల గురించి ఎన్నిసార్లు మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా, ముఖ్యమంత్రిని ఎన్నిసార్లు కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు, అధికారులు విద్యా సంస్థల సమస్యను కనీసం వినే ప్రయత్నం కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. ఫీజు బకాయిలపై సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఎస్‌యూ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు దసరా సెలవులు పూర్తయినా తెరవకూడదని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని యూనివర్సిటీ అధికారులకు కూడా తెలియజేసినట్లు వివరించారు.






# భార్యలేని లోకంలో ఉండలేక..

- రెండు నెలల క్రితం అనారోగ్యంతో సతీమణి మృతి
- రాఘవాపూర్‌లో ఉరేసుకొని భర్త ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 3: రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన భార్యను తలుచుకుంటూ ఆ భర్త కుంగిపోయాడు. ఆమె జ్ఞాపకాలను మరిచిపోలేక మనోవేదన చెందాడు. చివరకు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నాడు. బసంత్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన రాంప్రసాద్ - ప్రణవికి నాలుగేండ్ల క్రితమే వివాహం జరిగింది. రాంప్రసాద్ (28) మేషన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం ప్రణవి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో కుంగిపోయిన రాంప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి భార్యను తలుచుకుంటూ రోదించిన రాంప్రసాద్, ఉదయం ఇంటి వెలివేషన్ ఇనుపరాడ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి కుర్మ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.




